సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శనివారం ; 25 ; మే ; 2024



సోమశిలలో 7.590 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారానికి 7.590 టీఎంసీల నీటి నిల్వ ఉంది. పెన్నాడెల్టాకు 200, ఉత్తర కాలువకు 5, దక్షిణ కాలువకు 5 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.74,230
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.6,648
3 శాతం జీఎస్టీతో	రూ.6,847
నవర (8 గ్రా)	రూ.54,776



పరిపూర్ణం.. 'కోన' సంబరం

పెంచలకోనలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో వైభవంగా ముగిశాయి. చివరి ఘట్టాలను వేద పండితులు శాస్త్రోక్తంగా జరిపించారు. 8లో

పచ్చ 'ఖాకీ' బాస్‌లు



పచ్చనేతల కనుసన్నల్లో పోలీస్ యంత్రాంగం

- నిరాధార ఫిర్యాదులపై విచారణ లేకుండానే చర్యలు
- ఏఆర్‌హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్‌తో తేటతెల్లం
- సస్పెన్షన్ కాపీ ముందుగానే పచ్చనేతలకు చేరిన వైనం

సాక్షిప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో కొందరు 'ఖాకీ' బాస్‌లు.. 'పచ్చ' ముసుగేసుకున్నారు. టీడీపీ నేతల కనుసన్నల్లో విధులు నిర్వర్తిస్తూ.. పోలీస్‌శాఖ ప్రతిష్టను ఆ పార్టీకి తాకట్టు పెడుతున్నారు. ఎన్నికల సమయంలో జిల్లాలో టీడీపీ సాగించిన అరాచకాలకు అంతేలేదు. పోలీసుల సాక్షిగా టీడీపీ నేతలు బరితెగించి వైఎస్సార్‌సీపీ నేతలపై మారణాయుధాయులతో దాడులకు పాల్పడినా కనీసం కేసు నమోదు చేసిన దాఖలు లేవు. వైఎస్సార్‌సీపీ ఫిర్యాదులు చేసినా బుట్టదాఖలు చేశారు. అయితే టీడీపీ నేతలు చేసిన తప్పుడు ఫిర్యాదులపై మాత్రం కనీసం విచారణ లేకుండానే ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. నెల్లూరు నగరానికి చెందిన ఓ ఏఆర్‌హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్ పోలీసు ఉన్నతాధికారుల 'పచ్చ'పాత ధోరణికి అద్దం పడుతోంది.

కార్పొరేటర్ భర్త కావడమే..

ప్రలోభాలు, బెదిరింపులు, తప్పుడు కేసులను అస్త్రాలుగా చేసుకున్న పచ్చనేతలు పోలీసుల అండదండలతో వైఎస్సార్‌సీపీ నేతలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ పైశాచిక ఆనందం పొందుతున్నారు. నెల్లూరు నగరంలోని 41వ డివిజన్ కార్పొరేటర్ కె.విజయలక్ష్మి గతంలో నెల్లూరు రూరల్ మాజీ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అనుచర వర్గంలో ఉండేవారు. శ్రీధర్‌రెడ్డి వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలో చేరారు. ఆయనతో పాటు కొందరు టీడీపీలో చేరారు. ఆమె మాత్రం వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతున్నారు. పలుమార్లు పార్టీ మారాలని కోటంరెడ్డి ఆమెపై ఒత్తిడి తెచ్చినా.. ఆమె నిరాకరించారు. దీంతో ఎలాగైనా ఆమె టీడీపీలో చేరేలా చేయాలని భావించిన కోటంరెడ్డి ఆమె భర్త ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ మధుసూదన్‌రావును లక్ష్యంగా చేసుకున్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా.. ప్రయోజనం లేకపోవడంతో పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం 'పక్కా స్కెచ్' వేసి కక్ష సాధింపు చర్యలకు దిగారు. అందులో భాగంగా గతంలో మధుసూదన్‌రావు ఆదాల ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఉన్న ఫొటోలతో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. ఫిర్యాదులపై విచారించడంతో పాటు సదరు హెడ్‌కానిస్టేబుల్ సంజాయిషీని తీసుకుని చర్యలు తీసుకోవాల్సిన ఉన్నతాధికారులు ఏకపక్షంగా సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొనడంతో పాటు గత నెల 30వ తేదీ నుంచి విధులకు గైర్హాజరయ్యారంటూ సస్పెన్షన్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కేవలం మధుసూదన్‌రావు వైఎస్సార్‌సీపీకి చెందిన కార్పొరేటర్ భర్త కావడంతోనే ఆయన్ను సస్పెండ్ చేశారని పోలీస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

చేతికి శస్త్ర చికిత్సతో మెడికల్ లీవ్

వాస్తవానికి మధుసూదన్‌రావు చేతికి శస్త్ర చికిత్స జరగడంతో గత నెల 30వ తేదీ వరకు మెడికల్ లీవ్‌లో ఉన్నారు. డాక్టర్లు మరికొన్ని రోజులు విశ్రాంతి అవసరమని సూచించడంతో మెడికల్ లీవ్‌ను ఎక్స్‌టెన్షన్ చేయాలని ఆయన ఏఆర్ ఉన్నతాధికారులను లిఖిత పూర్వకంగా కోరారు. ఈ విషయాన్ని సైతం పోలీసు ఉన్నతాధికారులు పరిగణలోకి తీసుకోకుండా సస్పెండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా సస్పెన్షన్ కాపీ పచ్చనేతలకు చేరింది. వారు తమకు అనుకూల మీడియాల్లో, సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారు. టీడీపీ నేతలు గతంలోని ఫొటోలను, ఎన్నికల ప్రచార ఫొటోలుగా చూపించిన వెంటనే చర్యలు తీసుకున్న పోలీసు ఉన్నతాధికారులు, టీడీపీ నేతలపై పలు ఫిర్యాదులు అందినప్పటికి కనీస చర్యలు తీసుకోకపోవడం వారికి అండగా ఉన్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

సస్పెన్షన్ కాపీ.. టీడీపీ చేతుల్లో..

ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులు సదరు బాధితుడి కంటే ముందు టీడీపీ నేతలు, పచ్చమీడియా, ఆ వర్గ సోషల్ మీడియాకు చేరాయంటే.. పోలీసు ఉన్నతాధికారులు ఎవరి కనుసన్నల్లో పనిచేస్తున్నారో అర్థమవుతోంది. తనను సస్పెన్షన్ చేసిన విషయం తన శాఖ ద్వారా కాకుండా టీడీపీ నేతలు, పచ్చమీడియా ద్వారా తెలుసుకుని ఆ పోలీస్ అవాక్కయ్యారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసి పది రోజులు గడిచినా వైఎస్సార్‌సీపీ నాయకులు, వారి కుటుంబ సభ్యులను టార్గెట్ చేసి టీడీపీ నేతలు నిరాధార ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు. ఏ కేసైనా విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సిన పోలీస్ ఉన్నతాధికారులు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం చూస్తే.. పోలీసులు 'పచ్చకాప్'లుగా పనిచేస్తున్నారని ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్ ఉదంతంతో తేలిపోయింది.

న్యూస్‌రీల్

కౌంటింగ్ ప్రక్రియకు నలుగురు అబ్జర్వర్లు

నెల్లూరు (దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను పూర్తి స్థాయిలో పరిశీలించేందుకు నలుగురు అబ్జర్వర్లను కేంద్ర ఎన్నికల సంఘం నియమించింది. నగరంలోని కనుపర్తిపాడు ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో జిల్లాలో 8 అసెంబ్లీ నియోజకవర్గాలతో నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియ జూన్ 4న ప్రారంభం జరగనుంది. నియోజకవర్గాల వారీగా కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించేందుకు ఎన్నికల సంఘం అబ్జర్వర్లను నియమించింది. కందుకూరు, నెల్లూరు రూరల్ అసెంబ్లీ నియోజకవర్గాలకు అబ్జర్వర్‌గా రామ్‌కుమార్ గౌతమ్, కావలి, ఆత్మకూరులకు టీజీ అభిలాష్‌కుమార్, కోవూరు, నెల్లూరు సిటీ, ఉదయగిరి అసెంబ్లీ నియోజకవర్గాలకు నితిన్‌సింగ్ బదారియ, సర్వేపల్లికి జయేంద్రకుమార్ విజయవత్ అబ్జర్వర్లుగా వ్యవహరించనున్నారు.

సమర్థంగా కౌంటింగ్

కలెక్టర్ ఎం.హరినారాయణన్



నెల్లూరు (దర్గామిట్ట): కౌంటింగ్ ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఎం. హరినారాయణన్ రిటర్నింగ్ అధికారులకు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు సూచించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ తన క్యాంపు కార్యాలయంలో ఆర్వోలు, ఏఆర్వోలతో సమావేశమై కౌంటింగ్ నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూ ఆర్వోలు ఏఆర్వోలు సమన్వయంతో పనిచేసి నిష్పక్షపాతంగా పూర్తి చేయాలన్నారు. కౌంటింగ్ హాల్లో పోస్టల్ బ్యాలెట్, ఈవీఎంల ఓట్ల లెక్కింపు అవసరమైన టేబుల్స్, ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కౌంటింగ్ రోజు అన్ని వాహనాలు కనపర్తిపాడులోని హైస్కూల్ వరకు మాత్రమే అనుమతించ బడతాయని, ఏజెంట్లు, కౌంటింగ్ అధికారులు, సిబ్బందిని తరలించడానికి తగినన్ని బస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో రిటర్నింగ్ అధికారులు మున్సిపల్ కమిషనర్ వికాస్ మర్మత్, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరి డీఆర్‌ఓ ఎస్.లవన్న, నుడా వీసీ బాపిరెడ్డి, ఆర్వోలు ఓబులేసు, ప్రేమ్‌కుమార్, మాలోల, మధులత, డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస్, ఏఆర్వోలు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన



నెల్లూరు (దర్గామిట్ట): కనుపర్తిపాడులోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లను కలెక్టర్ ఎం.హరినారాయణన్ శుక్రవారం పరిశీలించారు. అనంతరం స్ట్రాంగ్ రూమ్‌లను సీసీటీవీ ద్వారా మానిటరింగ్ చేస్తున్న కంట్రోల్ రూమ్‌ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పారదర్శకంగా కౌంటింగ్ ప్రక్రియ

- కౌంటింగ్ విధుల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్, 8.30 గంటల నుంచి ఈవీఎంల ఓట్ల లెక్కింపు
- కౌంటింగ్ అధికారులు, సిబ్బంది, ఏజెంట్లకు గుర్తింపు కార్డులు తప్పనిసరి
- రిజర్వు సిబ్బంది కౌంటింగ్ కేంద్రంలోనే ఉండాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.హరినారాయణన్



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.హరినారాయణన్

నెల్లూరు (దర్గామిట్ట): కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలను పాటిస్తూ సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు విధులను పారదర్శకంగా, అప్రమత్తంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం. హరినారాయణ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జూన్ 4న నిర్వహించే ఓట్ల లెక్కింపు ప్రక్రియపై రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జూన్ 4న ఉదయం 8 గంటలకు కనుపర్తిపాడులోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. కౌంటింగ్ విధులు కేటాయించిన అధికారులు, సిబ్బంది అందరూ ఎటువంటి లోటుపాట్లు లేకుండా సజావుగా నిర్వహించేందుకు సంసిద్ధం కావాలని సూచించారు. కౌంటింగ్ అధికారులు, సిబ్బందికి, ఏజెంట్లకు గుర్తింపు కార్డులు తప్పనిసరిగా అందించాలని రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. కౌంటింగ్‌కు కేటాయించిన రిజర్వ్ సిబ్బంది అందరూ కౌంటింగ్ కేంద్రంలోనే అందుబాటులో ఉండాలన్నారు. కౌంటింగ్ సమయంలో అవసరమైన అన్నిరకాల ఫామ్స్, రబ్బరు స్టాంపు ముద్రలను ముందుగానే సిద్ధం చేసుకోవాలన్నారు. రౌండ్ల వారీగా ఫలితాలను ఫాం-17సీ లో పొందుపరిచి కౌంటింగ్ సూపర్‌వైజర్ ద్వారా రిటర్నింగ్ అధికారికి అందించాలన్నారు. ఫాం-17సీ జెరాక్స్ కాపీని ఏజెంట్లకు అందజేసి అకనాలెడ్జ్‌మెంట్ కాపీని తీసుకోవాలన్నారు. ఎలక్ట్రానికల్ పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి క్యూఆర్ కోడ్ స్కానింగ్ ప్రక్రియ చాలా ముఖ్యమైందన్నారు. ఈ విషయంపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏదైనా సందేహం ఉంటే ముందుగానే నివృత్తి చేసుకోవాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ఉదయం 8 గంటలకు, ఆ తర్వాత 8.30 గంటల నుంచి ఈవీఎంల కౌంటింగ్ మొదలు పెట్టాలన్నారు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 14 ఈవీఎం ఓట్ల లెక్కింపు టేబుళ్లతో పాటు రెండు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు టేబుళ్లు, ఒక ఆర్వో టేబుల్ మొత్తం 17 టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి టేబుల్ వద్ద ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, ఇద్దరు కౌంటింగ్ అసిస్టెంట్లు, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారని కలెక్టర్ వివరించారు. ఈవీఎంల్లో ఏదైనా సాంకేతిక సమస్య ఏర్పడితే వెంటనే బెల్ ఇంజినీర్ల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, సిబ్బంది అందరూ సమన్వయంతో పని చేసి ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా కౌంటింగ్ ప్రక్రియను సజావుగా పూర్తి చేసేందుకు పూర్తి స్థాయిలో కౌంటింగ్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సూచించారు. తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుపై నుడా వీసీ బాపిరెడ్డి, ఎలక్ట్రానికల్ ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టం (ఈటీపీబీఎస్) ఓట్ల లెక్కింపు ప్రక్రియపై నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్ అధికారి సురేష్ అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు సేతు మాధవన్, వికాస్ మర్మత్, విద్యాధరి, చిన్నఓబులేసు, మలోల, ప్రేమ్‌కుమార్, మధులత, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

నేడు ఏపీపీఎస్సీ పరీక్ష



పరీక్షల నిర్వహణపై మాట్లాడుతున్న డీఆర్‌ఓ లవన్న

- డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ఆన్‌లైన్ పద్ధతిలో పరీక్ష
- జిల్లాలో 5 కేంద్రాల్లో పరీక్ష
- హాజరుకానున్న 1,070 మంది అభ్యర్థులు
- అభ్యర్థులు ఉదయం 8.30 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి
- హాల్ టికెట్‌తో పాటు, ఏదైనా గుర్తింపు కార్డు తప్పనిసరి
- డీఆర్‌ఓ లవన్న వెల్లడి

నెల్లూరు (దర్గామిట్ట) : జిల్లా వ్యాప్తంగా శనివారం జరగనున్న ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) పరీక్షను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు డీఆర్‌ఓ లవన్న తెలిపారు. శుక్రవారం నెల్లూరు కలెక్టరేట్లో ఎస్ఆర్ శంకరన్ హాల్లో డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పోస్టుల భర్తీ కోసం నిర్వహిస్తున్న ఏపీపీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షపై సమన్వయ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లతో డీఆర్‌ఓ లవన్న, ఏపీపీఎస్సీ సెక్షన్ అధికారులు జి అశోక్, రామాంజి సమావేశం నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 5 పరీక్ష కేంద్రాల్లో శనివారం ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు ఆన్‌లైన్ పద్ధతిలో పరీక్ష జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 1,070 మంది అభ్యర్థులు డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టుల పోటీ పరీక్షకు హాజరవుతున్నారన్నారు. కావలిలో పీబీఆర్ విశ్వోదయ ఇంజినీరింగ్ కాలేజీ, రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో, కోవూరులోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాల, ముత్తుకూరు రోడ్‌లోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాల, పొట్టిపాళెం సమీపంలోని అయాన్ డిజిటల్ జోన్ పరీక్ష కేంద్రాల్లో పరీక్ష నిర్వహించేందుకు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆన్‌లైన్ పద్ధతిలో పరీక్ష నిర్వహిస్తున్నందున ఇంటర్నెట్, కంప్యూటర్ సాంకేతిక సమస్యలు లేకుండా ముందుగానే చూసుకోవాలన్నారు. సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్ష కేంద్రాలకు అనుమతించవద్దని, విద్యార్థులు హాల్ టికెట్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డును తప్పనిసరిగా పరిశీలించాలని, ఏపీపీఎస్సీ మార్గదర్శకాలను తప్పని సరిగా పాటిస్తూ పరీక్షను ప్రశాంతంగా నిర్వహించాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. ప్రతి కేంద్రం వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. అభ్యర్థులు నిర్ణీత సమయాని కంటే ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా ఏపీఎస్ ఆర్టీసీ అధికారులు బస్సులను నడపాలని చెప్పారు. పరీక్ష సమయంలో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. లైజనింగ్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు ఒక చెక్ లిస్ట్ తయారు చేసుకుని అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో సమన్వయ అధికారులు బ్రహ్మయ్య, గోపికృష్ణ, ఇలియాజ్, గయాజ్, ప్రదీప్, చీఫ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

పది పరీక్షలకు 1,426 మంది గైర్హాజరు

నెల్లూరు(టౌన్): జిల్లాలో పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పరీక్షలకు 2,056 మంది దరఖాస్తు చేసుకుంటే కేవలం 630 మంది మాత్రమే హాజరై పరీక్షలు రాశారు. 1,426 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల కోసం జిల్లా వ్యాప్తంగా 39 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణకు 39 మంది చీఫ్ సూపరింటెండెంట్లతో పాటు, 283 మంది ఇన్విజిలేటర్స్‌ను, 4 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు.

ఇంటర్ పరీక్ష కేంద్రాల్లో ఆర్ఐఓ తనిఖీ

నెల్లూరు(టౌన్): జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఇంటర్ మొదటి సంవత్సరానికి సంబంధించి తెలుగు, సంస్కృతం, హిందీ పరీక్షలు ఉదయం ప్రారంభమయ్యాయి. జనరల్ విద్యార్థులు 5,615 మందికి 5,313 మంది హాజరయ్యారు. 302 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 149 మందికి 126 మంది హాజరు కాగా, 23 మంది గైర్హాజరయ్యారు. రెండో సంవత్సరం తెలుగు, సంస్కృతం, హిందీ పరీక్షలు మధ్యాహ్నం నుంచి జరిగాయి. జనరల్ విద్యార్థులు 640 మందికి 57 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 162 మందికి గానూ 18 మంది హాజరు కాలేదు. ఈ సందర్భంగా ఆర్ఐఓ ఆదూరు శ్రీనివాసులు నారాయణ, శ్రీచైతన్య, కృష్ణచైతన్య తదితర 5 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి 2 సెంటర్లను, స్క్వాడ్ బృందాలు 30 కేంద్రాలను తనిఖీ చేశాయి. ఆర్ఐఓ శ్రీనివాసులు మాట్లాడుతూ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని తెలిపారు. ఎలాంటి మాస్‌కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పరీక్షలు పూర్తయ్యే వరకు రోజు వారి తనిఖీలు నిర్వహిస్తామన్నారు.



పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తున్న ఆర్ఐఓ శ్రీనివాసులు తదితరులు

'పొదుపు పెట్టుబడి' పక్కదారి

- మహిళా మార్ట్ నిమిత్తం ఒక్కొక్కరు రూ.300 వంతున పెట్టుబడి నిధి చెల్లింపు
- 8,052 మంది మహిళలు చెల్లించిన రూ.24 లక్షల స్వాహా?
- 18 నెలలుగా మార్ట్ ఊసే లేని వైనం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళల ఆర్థిక స్వావలంబనకు పెద్ద పీట వేసింది. పొదుపు మహిళల సారథ్యంలో జగనన్న మహిళా మార్ట్ (సూపర్ మార్కెట్)లకు శ్రీకారం చుట్టింది. ఇందుకోసం ప్రతి పొదుపు మహిళ నుంచి పెట్టుబడి నిధి కోసం సమీకరించిన నిధులు పక్కదారి పట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దాదాపు ఏడాదిన్నరగా మార్ట్ ఊసే లేకపోవడంతో పొదుపు మహిళలు అనుమానిస్తున్నారు. ఏపీఎం ఆ నిధులు స్వాహా చేసినట్లు సంఘ బంధాల సభ్యులు ఆరోపిస్తున్నారు.

చేజర్ల: జగనన్న మహిళా మార్ట్ ఏర్పాటు నిమిత్తం ఏడాదిన్నర క్రితం పొదుపు మహిళల వద్ద సేకరించిన పెట్టుబడి నిధి దాదాపు రూ.24 లక్షలు డీఆర్‌డీఏ అధికారులు పక్కదారి పట్టించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏడాదిన్నరగా మార్ట్ ఊసే లేకపోవడం, దీనికి సంబంధించి పొదుపు సంఘాల సమన్వయకర్తగా పనిచేస్తున్న ఏపీఎం సుజన (అడిషనల్ ప్రాజెక్ట్ మేనేజర్) పొంతన లేని సమాధానాలు చెబుతుండడంపై పొదుపు మహిళలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొదుపు మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు పొదుపు రుణాలతో పాటు వ్యక్తిగతంగా బ్యాంక్ రుణాలు మంజూరు చేయించి సొంతగా వ్యాపారాలు, చిన్న పరిశ్రమలు, పాడి పరిశ్రమల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో ప్రతి మండలం కేంద్రంలో జగనన్న మహిళా మార్ట్‌లు ఏర్పాటు చేసి తద్వారా వారి ఆదాయాన్ని మరింత మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా చేజర్ల మండలంలో జగనన్న మహిళా మార్ట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కోట్లాది రూపాయల బ్యాంక్ లింకేజీ రుణాలతో పాటు ప్రభుత్వం అందించే సున్నా వడ్డీ రుణాలు, ఇతర పొదుపు సంఘాల రుణాలతో ఏర్పాటు చేసే చిన్న చిన్న షాపులు, దుకాణాలు ఏర్పాటు ప్రక్రియ ఏపీఎం సుజన పర్యవేక్షిస్తోంది.



చేజర్లలో పొదుపు సంఘ కార్యాలయం

ఒక్కొక్కరు రూ.300 పెట్టుబడినిధి చెల్లింపు

చేజర్ల మండలం 26 గ్రామ పంచాయతీల్లో 26 సంఘ బంధాలు, 777 పొదుపు గ్రూపులు ఉన్నాయి. 8,052 మంది పొదుపు సభ్యులు ఉన్నారు. చేజర్లలో ఏడాదిన్నర క్రితం జగనన్న మహిళా మార్ట్ నిమిత్తం ప్రతి పొదుపు మహిళ నుంచి రూ.300 పెట్టుబడి నిధి కింద ఏపీఎం సుజన వసూలు చేసినట్లు పొదుపు మహిళలు చెబుతున్నారు. దాదాపు రూ.24 లక్షలకుపైగా సొమ్ము వసూలు చేసినా.. ఇంత వరకు మార్ట్ ఊసే లేకపోగా, ఏపీఎం లెక్కలు చెప్పకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పలువురు పొదుపు మహిళలు చెబుతున్నారు. ఈ నిధులు పక్కదారి పట్టాయని అనుమానాలను వ్యక్త పరిచారు.

డబ్బులు నేను స్వాహా చేయలేదు

పొదుపు సంఘాలు చెల్లించిన పెట్టునిధి డబ్బులు తాను స్వాహా చేలేదని ఏపీఎం సుజన తెలిపారు. మండలంలో మొత్తం 770 పొదుపు సంఘాలు ఉన్నాయని, ఒక్కొక్క సంఘం రూ.3,100 పెట్టుబడి నిధిగా చెల్లించాలన్నారు. మొత్తం రూ.23,87,000 వసూలు కావాల్సి ఉండగా, కేవలం రూ.4,15,000 మాత్రమే వచ్చాయన్నారు. ఈ మొత్తం కూడా సంఘం నుంచి సంఘ బంధం, సంఘ బంధం నుంచి సంఘమిత్రకు బదిలీ అయిందన్నారు. జగనన్న మహిళా మార్ట్ పేరుతో రూ.23 లక్షలు స్వాహా అయిందని ఆరోపణల్లో నిజం లేదన్నారు.

విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం

చేజర్ల మండలంలో జగనన్న మహిళా మార్ట్ నిమిత్తం వసూలు చేసిన నిధులు స్వాహా అయినట్లు నాకు ఎవరూ ఫిర్యాదు చేయలేదు. గతంలో ఇలాంటి ఘటనలు నా దృష్టికి వచ్చినప్పుడు విచారించి స్వాహా చేసిన వారిపై కేసులు నమోదు చేయించాం. ప్రస్తుతం అందరూ ఎన్నికల విధుల్లో బిజీగా ఉన్నాం.. ఎన్నికల ప్రక్రియ పూర్తి కాగానే చేజర్లలో మార్ట్ పేరుతో వసూలు చేసిన నిధులపై విచారణ జరిపిస్తాను. అవినీతికి పాల్పడినట్లు నిరూపితమైతే కఠిన చర్యలు తీసుకొంటాం. **– సాంబశివారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ**

గడ్డివామి దగ్ధం



కొడవలూరు: గడ్డివామి దగ్ధమై రూ.50 వేల నష్టం వాటిల్లింది. ఈ ఘటన మండలంలోని గండవరం అరుంధతీయవాడలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన మాతంగి మణి అనే సన్నకారు రైతు తన ఇంటికి సమీపంలో గడ్డివామి వేసుకున్నాడు. కారణం తెలియదు కానీ ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు గుర్తించి అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించారు. వామికి సమీపంలో నివాసాలుండడంతో స్థానికులంతా మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు. కాసేపటికి అగ్నిమాపక వాహనం వచ్చి మంటలను పూర్తిగా ఆర్పివేసింది.

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి

ప్రాంతీయ కార్యాలయం : ప్లాట్ నెం.1, ప్రశాంతినగర్, పొదలకూరు రోడ్, నెల్లూరు క్లబ్ దగ్గర, నెల్లూరు - 524003. ఫోన్ నెం:0861-2329730

పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ

పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం వారి ప్రకటన నెం **S.O.1533 (E) తేది: 14 సెప్టెంబర్, 2006** మరియు దాని తదుపరి సవరణలో పేర్కొన్న విధముగా **మెస్సర్స్ స్టార్ మినరల్స్ వారు రూ.55.0 లక్షల** పెట్టుబడితో జోగిపల్లి గ్రామం, సైదాపురం మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని **సర్వే నెం.11-A & 11-B** వద్ద **7.838 హెక్టార్ల** లీజ్ స్థలములో సంవత్సరమునకు **మైకా, క్వార్ట్జ్ మరియు ఫెల్డ్‌స్పార్ మైనింగ్ - 70,736 టన్నులు** మైనింగ్ ప్రతిపాదనకు సంబంధించి **పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ** జరుపబడును అని ఇందుమూలముగా తెలియజేయడమైనది. ఈ ప్రతిపాదిత ప్రాజెక్ట్ వివరములు దిగువ పేర్కొనబడినవి.

1	కంపెనీ పేరు చిరునామాతో	మెస్సర్స్ స్టార్ మినరల్స్, #101, శ్రీ తిరుమల రెసిడెన్సీ, శాంతినగర్, గూడూరు, తిరుపతి జిల్లా, పిన్‌కోడ్ - 524101
2	ప్రతిపాదిత ప్రాజెక్ట్ ప్రదేశం సర్వేనెం.	సర్వే నెం.11-A & 11-B, జోగిపల్లి గ్రామం, సైదాపురం మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా
3	భూమి విస్తీర్ణం	**7.838 హెక్టార్లు (19.37 ఎకరాలు)**
4	సంప్రదించవలసిన అధికారిక వ్యక్తి పేరు, చిరునామా & ఫోన్ నెం.	**శ్రీ కణిబాకం దయాకర్,** నిర్వాహక భాగస్వామి, **మెస్సర్స్ స్టార్ మినరల్స్,** #101, శ్రీ తిరుమల రెసిడెన్సీ, శాంతినగర్, గూడూరు, తిరుపతి జిల్లా, పిన్‌కోడ్ : 524101, ఫోన్ నెం: 9704869923
5	ప్రాజెక్ట్ వ్యయం	**రూ. 55.0 లక్షలు**
6	కార్యకలాప వివరములు మరియు సామర్థ్యం	మైకా, క్వార్ట్జ్ మరియు ఫెల్డ్‌స్పార్ మైనింగ్ - 70,736 టన్నులు సంవత్సరమునకు
7	బహిరంగ విచారణ తేది/ ప్రదేశం / సమయం	**తేది :** 26.06.2024 **సమయం :** మధ్యాహ్నం 3:30 గంటలకు **ప్రదేశం :** ప్రతిపాదిత ప్రాజెక్ట్ సమీపంలో సర్వే నెం.11-A & 11-B , జోగిపల్లి గ్రామం, సైదాపురం మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా
8	**ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పర్యావరణ ప్రభావ అంచనా నివేదిక మరియు సంక్షిప్త సారాంశ నివేదికలు ప్రజల పరిశీలనార్థం ఈ క్రింద పేర్కొనబడిన కార్యాలయంలో అందుబాటులో ఉంచడమైనది.**	
	i. కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ వారి కార్యాలయం, నెల్లూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.	
	ii. చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వారి కార్యాలయం, జిల్లా పరిషత్, నెల్లూరు.	
	iii. రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ వారి కార్యాలయం, నెల్లూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.	
	iv. జనరల్ మేనేజర్ వారి కార్యాలయం, జిల్లా పరిశ్రమల కేంద్రం, ఎ.కె.నగర్, నెల్లూరు.	
	v. ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్ వారి కార్యాలయం, పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ, ఇంటిగ్రేటెడ్ ప్రాంతీయ కార్యాలయం, విజయవాడ గ్రీన్ హౌస్ కాంప్లెక్స్, విజయవాడ-520010	
	vi. మెంబర్ సెక్రటరీ వారి కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, Dr.వైఎస్ఆర్ పర్యావరణ్ భవన్, APIIC కాలనీ రోడ్, గురునానక్ కాలనీ, ఆటోనగర్, విజయవాడ-520007	
	i. జాయింట్ చీఫ్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ వారి కార్యాలయం, జోనల్ ఆఫీస్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్లాట్ నెం.41, గురునానక్ రోడ్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదురుగా, శ్రీ కనకదుర్గ ఆఫీసర్స్ కాలనీ, విజయవాడ - 520008	
	ii. ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ వారి కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం, ప్లాట్ నెం.1, ప్రశాంతినగర్, పొదలకూరు రోడ్, నెల్లూరు క్లబ్ దగ్గర, నెల్లూరు-524003	
	iii. తహసిల్దార్ వారి కార్యాలయం, మండల రెవెన్యూ కార్యాలయం, సైదాపురం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా	
	iv. మండల ప్రజా పరిషత్ అభివృద్ధి ఆఫీసర్ వారి కార్యాలయం, సైదాపురం, SPSR నెల్లూరు జిల్లా.	
	v. పంచాయితీ సెక్రటరీ వారి కార్యాలయం,జోగిపల్లి గ్రామం, సైదాపురం మండలం, SPSR నెల్లూరు జిల్లా.	

కేంద్ర పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం వారి మరియు దాని తదుపరి సవరణలో పేర్కొనబడిన విధంగా ఈ ప్రతిపాదిత కార్యకలాపాల వలన స్థానభ్రంశం చెందువారు, పర్యావరణ పరంగా ఇబ్బందులు ఎదుర్కొనువారు తమ అభిప్రాయాలు, సలహాలు, సూచనలు లేక అభ్యంతరములు ఈ ప్రకటన వెలువడిన 30 రోజుల లోపు లిఖితపూర్వకముగా కింద సంతకందారునకు తెలియపరచమని కోరడమైనది మరియు పైన పేర్కొనబడిన వేదిక, తేది, సమయము నందు జరుగు ప్రజాభిప్రాయ సేకరణలో స్వయంగా పాల్గొని తమ అభిప్రాయములను తెలియచేయవచ్చును.

ప్రదేశం : నెల్లూరు
తేది : 24.05.2024

సం// ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్
ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి
ప్రాంతీయ కార్యాలయం, నెల్లూరు.

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి

ప్రాంతీయ కార్యాలయం : ప్లాట్ నెం.1, ప్రశాంతినగర్, పొదలకూరు రోడ్, నెల్లూరు క్లబ్ దగ్గర, నెల్లూరు - 524003. ఫోన్ నెం:0861-2329730

పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ

పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం వారి ప్రకటన నెం **S.O.1533 (E) తేది: 14 సెప్టెంబర్, 2006** మరియు దాని తదుపరి సవరణలో పేర్కొన్న విధముగా **మెస్సర్స్ శ్రీ వర్ధారు భాస్కరయ్య వారు రూ.40.0 లక్షల** పెట్టుబడితో పొదలకూరు గ్రామం, పొదలకూరు మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని **సర్వే నెం.707** వద్ద **2.574 హెక్టార్ల** లీజ్ స్థలములో సంవత్సరమునకు **క్వార్ట్జ్ మైనింగ్ - 74,829 టన్నులు** మైనింగ్ ప్రతిపాదనకు సంబంధించి **పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ** జరుపబడును అని ఇందుమూలముగా తెలియజేయడమైనది. ఈ ప్రతిపాదిత ప్రాజెక్ట్ వివరములు దిగువ పేర్కొనబడినవి.

1	కంపెనీ పేరు చిరునామాతో	శ్రీ వి.భాస్కరయ్య, ఫ్లాట్ నెం.106, పావని విల్లా, వేదాయపాళెం, నెల్లూరు. పిన్‌కోడ్ - 524004
2	ప్రతిపాదిత ప్రాజెక్ట్ ప్రదేశం సర్వేనెం.	సర్వే నెం.707, పొదలకూరు గ్రామం, పొదలకూరు మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా
3	భూమి విస్తీర్ణం	**2.574 హెక్టార్లు**
4	సంప్రదించవలసిన అధికారిక వ్యక్తి పేరు, చిరునామా & ఫోన్ నెం.	**శ్రీ వి.భాస్కరయ్య,** ఫ్లాట్ నెం.106, పావని విల్లా, వేదాయపాళెం, నెల్లూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా. పిన్‌కోడ్ - 524004 ఫోన్ నెం: 99594 85900
5	ప్రాజెక్ట్ వ్యయం	**రూ. 40.0 లక్షలు**
6	కార్యకలాప వివరములు మరియు సామర్థ్యం	**క్వార్ట్జ్ మైనింగ్ - 74,829 టన్నులు సంవత్సరమునకు**
7	బహిరంగ విచారణ తేది/ ప్రదేశం / సమయం	**తేది :** 26.06.2024 **సమయం :** ఉదయం 11:00 గంటలకు **ప్రదేశం :** ప్రతిపాదిత ప్రాజెక్ట్ సమీపంలో సర్వే నెం.707, పొదలకూరు గ్రామం, పొదలకూరు మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా
8	**ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పర్యావరణ ప్రభావ అంచనా నివేదిక మరియు సంక్షిప్త సారాంశ నివేదికలు ప్రజల పరిశీలనార్థం ఈ క్రింద పేర్కొనబడిన కార్యాలయంలో అందుబాటులో ఉంచడమైనది.**	
	i. కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ వారి కార్యాలయం, నెల్లూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.	
	ii. చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వారి కార్యాలయం, జిల్లా పరిషత్, నెల్లూరు.	
	iii. రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ వారి కార్యాలయం, నెల్లూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.	
	iv. జనరల్ మేనేజర్ వారి కార్యాలయం, జిల్లా పరిశ్రమల కేంద్రం, ఎ.కె.నగర్, నెల్లూరు.	
	v. ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్ వారి కార్యాలయం, పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ, ఇంటిగ్రేటెడ్ ప్రాంతీయ కార్యాలయం, విజయవాడ గ్రీన్ హౌస్ కాంప్లెక్స్, విజయవాడ-520010	
	vi. మెంబర్ సెక్రటరీ వారి కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, Dr.వైఎస్ఆర్ పర్యావరణ్ భవన్, APIIC కాలనీ రోడ్, గురునానక్ కాలనీ, ఆటోనగర్, విజయవాడ-520007	
	i. జాయింట్ చీఫ్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ వారి కార్యాలయం, జోనల్ ఆఫీస్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్లాట్ నెం.41, గురునానక్ రోడ్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదురుగా, శ్రీ కనకదుర్గ ఆఫీసర్స్ కాలనీ, విజయవాడ - 520008	
	ii. ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ వారి కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం, ప్లాట్ నెం.1, ప్రశాంతినగర్, పొదలకూరు రోడ్, నెల్లూరు క్లబ్ దగ్గర, నెల్లూరు-524003	
	iii. తహసిల్దార్ వారి కార్యాలయం, మండల రెవెన్యూ కార్యాలయం, పొదలకూరు, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా	
	iv. మండల ప్రజా పరిషత్ అభివృద్ధి ఆఫీసర్ వారి కార్యాలయం, పొదలకూరు, SPSR నెల్లూరు జిల్లా.	
	v. పంచాయితీ సెక్రటరీ వారి కార్యాలయం, పొదలకూరు గ్రామం & మండలం, SPSR నెల్లూరు జిల్లా.	

కేంద్ర పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం వారి మరియు దాని తదుపరి సవరణలో పేర్కొనబడిన విధంగా ఈ ప్రతిపాదిత కార్యకలాపాల వలన స్థానభ్రంశం చెందువారు, పర్యావరణ పరంగా ఇబ్బందులు ఎదుర్కొనువారు తమ అభిప్రాయాలు, సలహాలు, సూచనలు లేక అభ్యంతరములు ఈ ప్రకటన వెలువడిన 30 రోజుల లోపు లిఖితపూర్వకముగా కింద సంతకందారునకు తెలియపరచమని కోరడమైనది మరియు పైన పేర్కొనబడిన వేదిక, తేది, సమయము నందు జరుగు ప్రజాభిప్రాయ సేకరణలో స్వయంగా పాల్గొని తమ అభిప్రాయములను తెలియచేయవచ్చును.

ప్రదేశం : నెల్లూరు
తేది : 24.05.2024

సం// ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్
ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి
ప్రాంతీయ కార్యాలయం, నెల్లూరు.

పరిపూర్ణం.. 'కోన' సంబరం



తెప్పపై విహరిస్తున్న స్వామి, అమ్మవార్లు



తెప్పోత్సవానికి హాజరైన భక్తులు

- ముగిసిన పెనుశిల బ్రహ్మోత్సవాలు
- శాస్త్రోక్తంగా చక్రస్నానం
- తెప్పపై ఊరేగిన దేవదేవులు

రాపూరు: పెంచలకోనలో శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. చివరిరోజు ఉదయం శ్రీవారి చక్రస్నాన ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్లతోపాటు చక్రతాళ్వార్‌ను పల్లకిలో కొలువుదీర్చారు. మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా శ్రీవారి నందనవనంలోని పుష్కరిణి వద్ద మండపంలోకి వేంచేపు చేశారు. విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, నవ కలశ స్నపన తిరుమంజనం నిర్వహించారు. పసుపు, కుంకుమ, చందనం, సుగంధ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు జరిపించారు. అనంతరం వేదపండితులు మంత్రోచ్ఛారణల నడుమ పుష్కరిణిలో చక్రతాళ్వార్‌కు స్నానం చేయించారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేశారు.

- స్వామివారి అలంకార మండపంలో ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేతంగా పెంచలస్వామిని కొలువుదీర్చారు. అనంతరం వేడుకగా వసంతోత్సవం నిర్వహించారు. దేవదేవేరులకు ప్రత్యేక పూజలు చేపట్టి విశేష అభిషేకాలు జరిపించారు.

తెప్పోత్సాహం

శోభాయమానంగా అలంకరించిన తెప్పపై పెనుశిల నృసింహస్వామి ఉభయనాంచారులతో కలిసి పుష్కరిణిలో విహరిస్తూ భక్తులకు దర్శమిచ్చారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరై దేవదేవేరులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి 10 గంటలకు స్వామిని అశ్వవాహనంపై కొలువుదీర్చి మాడవీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. రాత్రి 11 గంటలకు అర్చకులు శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం జరిపించి బ్రహ్మోత్సవాలను పరిపూర్ణం చేశారు. కార్యక్రమాల్లో డీసీ విజయసాగర్‌బాబు, ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు, ఉప ప్రధానార్చకులు పెంచలయ్యస్వామి, సీతారామయ్యస్వామి, టీటీడీ పాంచరాత్ర ఆగమపండితులు రామానుజాచార్యులు పాల్గొన్నారు.

నేడు గోనుపల్లెలో గ్రామోత్సవం

స్వామి అమ్మవార్లు శనివారం ఉదయం పెంచలకోన నుంచి బయలుదేరి గోనుపల్లె గిరిజన కాలనీకి చేరుకుంటారు.రాత్రి 8 గంటలకు గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.



స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం



తిలకిస్తున్న భక్తులు



పుష్కరిణిలో సుదర్శన చక్రానికి స్నానం చేయిస్తున్న వేదపడింతులు

జ్యూస్ ఫ్యాక్టరీలకు మామిడి ఎగుమతులు



బెంగళూరు రకం మామిడి

ఉలవపాడు: ఉలవపాడు నుంచి మామిడి ఎగుమతులు ప్రారంభమయ్యాయి. జ్యూస్ తయారు చేయడానికి బెంగళూరు రకాన్ని ఉపయోగిస్తారు. ప్రతి ఏడాది ఉలవపాడు నుంచి ఈ రకాన్ని ఫ్యాక్టరీలకు తరలిస్తారు. స్థానిక తోటల్లో కాయలను కోసి కాటాల వద్దకు తీసుకొచ్చి తూకం వేసి లారీల్లోకి లోడింగ్ చేసి తరలిస్తున్నారు. రాష్ట్రంలో చిత్తూరు జిల్లాలో మామిడి జ్యూస్ తయారు చేసే ఫ్యాక్టరీలు అధికంగా ఉన్నాయి. ఉలవపాడు పరిసర ప్రాంతాల నుంచి వాటికి బెంగళూరు రకం కాయల ఎగుమతి ప్రస్తుతం ముమ్మరంగా జరుగుతోంది. రోజుకు సుమారు 100 టన్నులకు పైగా పంపుతున్నారు. ఈ ఏడాది ప్రారంభంలోనే బెంగళూరు రకం టన్ను రూ.20 వేలు పలుకుతోంది. ఈ మామిడిలో పీచు అధికంగా ఉంటుంది. అందువల్ల జ్యూస్ తయారీకి బాగుంటుంది. ప్రస్తుతం కాపు తక్కువగా ఉండడంతో కాయలకు డిమాండ్ అధికంగా ఉంది. ప్రతి ఏడాది రూ.10 వేల నుంచి ప్రారంభమై రూ.20 వేలు, రూ.25 వేల వరకు రేటు వెళ్తుంది. కానీ సీజన్ ప్రారంభంలోనే టన్ను రూ.20 వేల వరకు ఉంది. కాయలు తక్కువగా ఉండడంతో రేటు అధికంగా ఉన్నట్లు చెబుతున్నారు.



లారీలోకి ఎగుమతి చేసిన మామిడి కాయలు

నిమ్మ ధరలు (కిలో)	
పెద్దవి	: రూ.70
సన్నవి	: రూ.35
పండ్లు	: రూ.25



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు	
బ్రాయిలర్ (లైవ్)	: 172
లేయర్ (లైవ్)	: 120
బ్రాయిలర్ చికెన్	: 300
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 330
లేయర్ చికెన్	: 204

38 మోటార్‌బైక్‌లు, ఆటో స్వాధీనం



పట్టుబడిన వాహనాలతో దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ అల్తాఫ్ హుస్సేన్, సిబ్బంది

నెల్లూరు(క్రైమ్): జిల్లా వ్యాప్తంగా సమస్యాత్మక, శివారు ప్రాంతాల్లో పోలీసు అధికారులు కార్డన్ సెర్చ్ పేరిట నిరంతర సోదాలు నిర్వహిస్తున్నారు. సరైన పత్రాల్లేని వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. శుక్రవారం తెల్లవారుజామున నెల్లూరు నగరంలోని దర్గామిట్ట పోలీసుస్టేషన్ పరిధిలో ప్రగతినగర్, గౌతమినగర్‌లో స్థానిక ఇన్‌స్పెక్టర్ అల్తాఫ్ హుస్సేన్ తన సిబ్బందితో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని ప్రతి ఇంటినీ తనిఖీ చేశారు. సరైన పత్రాల్లేని 12 మోటార్‌బైక్‌లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా ఇందుకూరుపేట, ముత్తుకూరు, సంగం, వింజమూరు, దుత్తలూరు, ఉదయగిరి, కావలి రెండో టౌన్, కావలి రూరల్, కొండాపురం, గుడ్లూరు పోలీసుస్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లోనూ పోలీసు అధికారులు సోదాలు నిర్వహించి సరైన ధ్రువీకరణపత్రాలు లేని 26 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడే వరకూ సెర్చ్ కొనసాగుతుందని అధికారులు తెలిపారు. ఎన్నికల వేళ అల్లర్లకు పాల్పడి కేసుల్లో ఇరుక్కొని జీవితాలను నాశనం చేసుకోవద్దని యువతకు సూచించారు.

బతుకుదెరువు కోసం వచ్చి..

- అద్దాలు బిగిస్తూ కింద పడి యువకుడి మృతి

ఆత్మకూరు: బతుకుదెరువు కోసం వేరే రాష్ట్రం నుంచి వచ్చిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు మృతిచెందాడు. భవనంలో కిటికీలకు అద్దాలు బిగిస్తుండగా అదుపుతప్పి కాలుజారి కిందపడి చనిపోయిన ఘటన ఆత్మకూరులో శుక్రవారం జరిగింది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని పెద్ద మసీదు సెంటర్ సమీపంలో నూతన భవనం నిర్మిస్తున్నారు. ఆ భవనం కిటికీలకు అద్దాలు బిగించే వర్క్‌ను ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. అతడి వద్ద పనిచేస్తున్న ఉత్తరప్రదేశ్‌కి చెందిన కార్మికుడు హుస్సేన్ (26) గురువారం సాయంత్రం అద్దాలు బిగిస్తుండగా పైనుంచి కింద పడ్డాడు. బావి దిమ్మెలపై హుస్సేన్ పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. తోటి కార్మికులు గుర్తించి వెంటనే ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా మృతుడు అవివాహితుడు.